# యాసంగికి రైతన్న సమాయత్తం

- ఇప్పటికే దుక్కిదున్ని నారుమడులు సిద్ధం
- ఆధునిక సాగు పద్ధతుల వైపు అన్నదాత మొగ్గు



మానకొండూర్ రూరల్: ముంజంపల్లిలో నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి

వీణవంక/ హుజూరాబాద్ రూరల్/ మానకొండూర్ రూరల్, డిసెంబర్ 5: రైతులు యాసంగి సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే కొందరు దుక్కిదున్ని, నారుమడుల్లో నారు పోసుకోగా, మరికొందరు ఆయా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులవైపు మొగ్గు చూపుతున్నారు. వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో వరి నాటు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**వీణవంకలో 23 వేల ఎకరాల్లో సాగు**

మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 26,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, అందులో 23 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇందులో ఏటా 14 వేల ఎకరాల్లో సీడ్ (మేల్, ఫిమేల్, ఓపీ) రకాలు సాగు చేస్తుండగా, తొమ్మిది వేల ఎకరాల్లో దొడ్డురకం పండిస్తున్నారు. మూడు వేల ఎకరాల్లో మక్క పండిస్తుండగా, 500 ఎకరాల్లో పత్తి, తదితర పంటలు సాగు చేస్తున్నారు. వీణవంక వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు, వ్యవసాయ బావుల్లో నీళ్లు సమృద్ధిగా ఉండడంతో రైతులు యాసంగి పనులు ముమ్మరం చేశారు.

**మానకొండూర్‌లో 34 వేల ఎకరాల్లో..**

మానకొండూర్ మండలంలో యాసంగిలో దాదాపు 30 వేల నుంచి 34 వేల ఎకరాల్లో వరి సాగుతో పాటు వివిధ పంటలను వేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇందుకు కావాల్సిన మోతాదులో అన్నదాతలకు విత్తనాలు, ఎరువులను సైతం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మండలంలోని గంగిపల్లి, కొండపల్కల, పచ్చునూర్, వన్నారం, గట్టుదుద్దెనపల్లి గ్రామాల్లో ఇప్పటికే కొందరు రైతులు నారు మడులు సిద్ధం చేసుకొని నార్లు పోసుకున్నారు. కొందరు వెదజల్లే పద్ధతి అనుసరిస్తున్నారు.



మానకొండూర్ రూరల్: మద్దికుంటలో పొలం దున్నుతున్న రైతు

**హుజూరాబాద్‌లో 21వేల ఎకరాల్లో..**

హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో గల గ్రామాల్లో 21,700 ఎకరాల్లో వరి, 300 ఎకరాల్లో మక్క, 100 ఎకరాల్లో ఇతర పంటలను రైతులు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇందులో 40శాతం దొడ్డు రకం, మరో 60 శాతం సన్నరకం వరి వేయనున్నట్లు తెలిపారు. గత యాసంగి ఏప్రిల్‌లో వడగండ్ల వర్షాలు పడడంతో రైతులు నష్టపోయారు. అందుకే ఈ సారి ముందస్తుగా మార్చిలో పంటలు చేతికి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

**వ్యవసాయశాఖ అధికారుల సూచనలు**

యాసంగి నారు పోసుకునేందుకు ఈ నెల 20 వరకు అనుకూలం. నారుపోసే వారం ముందే నారుమడి దుక్కి దున్ని ఉంచుకోవాలి. నారుపోసే ముందు మళ్లీ దున్నించి సమాంతరంగా చేసుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత ఆరుతడి బాగా వచ్చేలా నారుమడి నుంచి నీరు వెళ్లేలా చూసుకోవాలి. విత్తన వడ్లను తప్పనిసరిగా శుద్ధి చేయాలి. యాసంగిలో స్వల్పకాల వరి విత్తనాలనే ఎంచుకోవాలి. నారుమడిలో కలుపు యాజమాన్యం పాటించాలి. విత్తనం చల్లిన వారం, పది రోజుల తర్వాత కలుపు నివారణ మందులను పిచికారీ చేయాలి. విత్తనం చల్లిన వారం తర్వాతే నీళ్లు పలుచగా ఉంచాలి. వరినాటేసే వారం ముందు గుళికలు చల్లుకోవాలి. చల్లిన తర్వాత నీటిని నారుమడి లోనే ఉండాలి.



వీణవంకలో నిండుకుండలా వ్యవసాయ బావి



పాఠశాలలో పరీక్ష ప్యాడ్‌లు పొందిన విద్యార్థినులతో ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్, ప్రిన్సిపాల్ వీ మీనాక్షి

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌ల వితరణ

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 5: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కేసీ క్యాంపులో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు మంగళవారం హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్(రిటైర్డ్ టీచర్) పరీక్ష ప్యాడ్‌లు వితరణ చేశారు. మొత్తం 73 మందికి పరీక్ష ప్యాడ్‌లు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీ మీనాక్షి మాట్లాడుతూ, మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థిలకు చేయూతనందించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రూ.2 లక్షల విలువచేసే పరీక్ష ప్యాడ్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దీర్ఘకాలిక లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 5: ప్రతి విద్యార్థి దీర్ఘకాలిక లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని, దానిని సాధించేందుకు దోహదపడే కోర్సును ఎంచుకొని శాస్త్రీయ పద్ధతిలో చదవాలని కెరీర్ ప్లానింగ్, మానసిక నిపుణుడు డాక్టర్ ధర్మేందర్ నడిమెట్ల సూచించారు. మంగళవారం మండలంలోని కేంద్రీయ విద్యాలయంలో 9-11వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రకటనలు, ఇతర ప్రలోభాలకు లోనవ్వకుండా ఒత్తిడిని అధిగమించి ముందుకెళ్లాలని సూచించారు. మానసిక రుగ్మతలకు లోనవకుండా మొబైల్ ఫోన్లను లక్ష్యసాధనకు ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్, ఉపాధ్యాయులు రామ్ నారాయణ, సునీత శర్మ, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రానైట్ లారీ బీభత్సం.. తప్పిన పెను ప్రమాదం

తిమ్మాపూర్, డిసెంబర్ 5: రాజీవ్ రహదారిపై లారీ బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుభాష్ నగర్ స్టేజీ వద్ద హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు ఖాళీగా వెళ్తున్న గ్రానైట్ లారీ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌కు ఢీకొని మళ్లీ ఎడమవైపు తిరిగి రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌కు బీపీ తక్కువ కావడంతో ఈ ప్రమాదం జరుగగా, ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనా స్థలం వద్ద విద్యార్థులు నిత్యం తిరుగుతుంటారు. ప్రమాదానికి కొన్ని అడుగుల దూరంలోనే ఓ కారు నిలిపి ఉంచగా, కొంత మంది వ్యక్తులు నిల్చొని ఉన్నారు. అదృష్టవశాత్తు లారీ చెట్లలోకి దూసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌ను దవాఖానకు తరలించారు. లారీని చెట్ల పొదల్లో నుంచి బయటకు తీశారు.

## బొమ్మనపల్లి పాఠశాలలో వైద్య శిబిరం

చిగురుమామిడి, డిసెంబర్ 5: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కేలోభాగంగా హుజూరాబాద్‌కు చెందిన వైద్య బృందం డాక్టర్ అనురాగ రేఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినులకు పరీక్షలు చేశారు. ఎత్తు, బరువు సరిచూసి, తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. భోజన సమయంలో సమయపాలన పాటించాలని, లేకపోతే ఏకాగ్రత లోపించి చదువులో వెనుకబడే అవకాశాలు ఉంటాయని వైద్యాధికారి పేర్కొన్నారు. వైద్య శిబిరంలో ఫార్మసిస్ట్ బీ శ్వేతారెడ్డి, ఏఎన్ఎం ఆర్ శారద, వైద్య బృందంతో పాటు ప్రధానోపాధ్యాయుడు పోలాడి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు కానిగంటి రాజమౌళి, శ్యామయ్య, జ్యోత్స్న, శంకరమ్మ, శంకర్ పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తిమ్మాపూర్, డిసెంబర్ 5: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మన్నెంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి రాజు (29) భార్య కవిత ఇటీవల పలు కారణాలతో కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డు పైపులకు ఉరేసుకొని మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాజు మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజు తండ్రి జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.

## సేవా భావాన్ని పెంపొందించుకోవాలి

గన్నేరువరం, డిసెంబర్ 5: విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు సూచించారు. మండలంలోని జంగపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూఎన్ వలంటీర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి నాటికి చదువులో మంచి ప్రతిభ చూపిన 10వ తరగతి పిల్లలకు తగిన ప్రోత్సాహకం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, సర్పంచ్ శారద, హెచ్ఎం శారద, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, క్లస్టర్ ఫెసిలిటేటర్ రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా యునైటెడ్ నేషన్స్ వలంటీర్స్ డే



యూ ఎన్ వీ అక్షరాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 5: మండలంలోని వెల్ది జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం కరీంనగర్ స్వచ్ఛ భారత్ క్లస్టర్ ఫెసిలిటేటర్ కల్యాణి, వలంటీర్ల బృందం ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ వలంటీర్స్ డే, ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాముఖ్యత, స్వచ్ఛత, మృత్తిక ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛందంగా విద్యార్థులు నిర్వర్తించాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాపెల్లి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సంపత్, మహిళా వలంటీర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

చిగురుమామిడి, డిసెంబర్ 5: మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రోడ్లపై చెత్తాచెదారాన్ని తొలగించారు. ట్రాక్టర్ల ద్వారా డంప్ యార్డ్‌కు తరలించారు. అలాగే దోమల నివారణకు మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు జరిపిస్తున్నామని తెలిపారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 5: హుజూరాబాద్ పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండో విడుత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాధికారి కేతిరి వెంకటనరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. హుజూరాబాద్ మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం రెండో విడుత పాఠ్యపుస్తకాలు 6048, పదో తరగతి విద్యార్థుల కోసం అభ్యాస దీపిక పుస్తకాలు 1148 ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 30 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, 18 ఉన్నత పాఠశాలలకు రెండు రోజుల్లో పుస్తకాల సరఫరా పూర్తి అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీతారాంపల్లి, సీఆర్పీలు గూండా రాజిరెడ్డి, రంగు దామోదరాచారి, రవిబాబు, ఎస్ సుధామన్, మధు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో ప్రజల సహకారం మరువలేనిది

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 5: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో నియోజకవర్గ ప్రజల సహాయ సహకారాలు మరువలేనివని హుజూరాబాద్ ఆర్‌డీవో, రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో భాగస్వాములైన అధికారులు, నియోజకవర్గ ప్రజలు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాగాల సంపత్‌రెడ్డి మృతి తీరనిలోటు

సైదాపూర్, డిసెంబర్ 5: జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని సింగిల్‌విండో చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.